క్లుప్తంగా

చిత్రకళా ప్రదర్శన రేపు

మల్కాపురం: ప్రముఖ చిత్రకారులు వడ్డాది పాపయ్య, అంట్యాకుల పైడిరాజు స్మారకార్థం కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం వద్ద ఈ నెల 25న చిత్రకళా ప్రదర్శన నిర్వహించనున్నారు. విశాఖ జిల్లా నుంచి సుమారు 23మంది చిత్రకారులు పాల్గొని, తమ చిత్ర కళాఖండాలను ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు, చిత్రకళా పరిషత్ ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ప్రవేశం ఉచితమని పేర్కొన్నారు. ఔత్సాహికులు 79893 36162 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నూతన కార్యాలయం ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్‌లో రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు ఏర్పాటు చేసిన నూతన కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ద్వారా వచ్చే నిధులను వెలమల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామ్మోహన్‌నాయుడు, లాలం లావణ్య తదితరులు పాల్గొన్నారు.

28న జీవీఎంసీ దుకాణాలకు వేలం

జగదాంబ: జీవీఎంసీ జోన్–4 పరిధిలోని దుకాణాలు, కల్యాణ మండపాలకు ఈ నెల 28న వేలంపాట నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు తెలిపారు. 31వ వార్డులోని డయాస్ ట్యాంక్ వాణిజ్య సముదాయం పై అంతస్తులోని షాపులు, కింద షెల్లార్లలో ఉన్న 9, 10, 11, 12, 13, 15 దుకాణాలకు, టీఆర్‌ఎస్ కాంప్లెక్స్‌లోని 3, 25, 26, 31, 35, 39, 47, 21 దుకాణాలకు వేలం వేస్తున్నట్లు చెప్పారు. 35వ వార్డు పాత బస్‌స్టాండ్‌లో పేజ్–2లోని 1 నుంచి 14 దుకాణాలు, సూర్యాబాగ్ వద్ద జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 9వ నంబర్ షాపు, 39వ వార్డు పద్మానగర్ లక్ష్మీటాకీస్ వద్ద వాణిజ్య సముదాయం దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈ దుకాణాలకు మూడేళ్ల కాలపరిమితికి వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 28న జోన్–4 కార్యాలయంలో నిర్వహించే వేలంపాటలో పాల్గొవాలని కోరారు. వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని జెడ్సీ తెలిపారు.

విద్యార్థులకిచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి
- ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

దాబాగార్డెన్స్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్, జిల్లా అధ్యక్షుడు నాయుడు సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివారం ఎంవీపీ కాలనీలోని ఎల్‌ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ జిల్లా 36వ మహాసభలు నిర్వహించిన నేపథ్యంలో పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని హామీనిచ్చిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నెలలు గడుస్తున్నా.. విడుదల చేయకపోవడం వల్ల లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి చేస్తూ ముక్కు పిండి వసూలు చేస్తున్నాయన్నారు. పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77 రద్దు చేయాలని, యూనివర్సిటీల్లో పర్మినెంట్ వీసీలను నియమించి, ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు సరిపడా మెస్ చార్జీలు పెంచి హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర వ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిందని, నూతన ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

జిల్లా కమిటీ ఎన్నిక

ఎస్‌ఎఫ్‌ఐ విశాఖ జిల్లా నూతన కమిటీ, జిల్లా ఆఫీస్ బేరర్స్‌గా మొత్తం 30 మందిని ఎన్నుకున్నట్లు రాష్ట్ర కార్యదర్శి అశోక్ తెలిపారు. నూతన కమిటీలో జిల్లా కార్యదర్శిగా ఎల్‌జే నాయుడు, అధ్యక్షుడిగా జి.అజయ్‌ను మహాసభ ప్రతినిధులు ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా జి.రాము, జి.పల్లవి, పి.సాయితేజ, జిల్లా సహాయ కార్యదర్శులుగా శశికుమార్, కౌశిక్, వెంకటరమణ, అజయ్ ఎన్నికయ్యారు.

ఆ మార్గాలు అధ్వానంగా మారాయి. అడుగుకో గుంత.. గజానికో గొయ్యితో ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో వాటిని గుర్తించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎత్తుపల్లాలకు తోడు బురదమయంగా మారడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు బోల్తాపడుతున్నాయి. పాలకులు, అధికారులు స్పందించి ఆ రోడ్లను అభివృద్ధి చేయాలని వేడుకుంటున్నారు.

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?

బురదమయంగా సేవా మార్గాలు • బోల్తా పడుతున్న ఆటోలు, ద్విచక్ర వాహనాలు





నరకం చూస్తున్నాం



గుల్లలపాలెం నుంచి గాజువాక ఆర్టీసీ డిపో వైపు వెళ్లే సేవా మార్గంలో తవ్విన గోతుల్లో మట్టి సరిగ్గా పూడ్చకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణం సాగించలేని విధంగా మారింది. అధికారులు స్పందించి గుంతలను పూర్తిగా కప్పి వాహనదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి.

– ఉరుకూటి తాతారావు, ద్విచక్ర వాహనదారుడు

అధికారులు స్పందించాలి



ములగాడ నుంచి శ్రావణి షిప్పింగ్‌కు వెళ్లే మార్గం చాలా అసౌకర్యంగా ఉంది.ఈ మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణం సాగించాలంటే నరకం కనిపిస్తోంది. గుంతల్లో బురద నీరు ఉండడంతో గుర్తించలేక ద్విచక్ర వాహనాలు ఆ గుంతల్లో దిగవడుతున్నాయి.అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డును అభివృద్ధి చేయాలి.

– చట్టి వినయ్‌కుమార్, వాహనదారుడు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ విలేజ్ నుంచి శ్రావణి షిప్పింగ్ మీదుగా మారుతి సర్కిల్ వైపు వెళ్లే సీసీ మార్గం పూర్తిగా శిథిలావస్థకు చేరింది.రోడ్డు అంతా గుంతలు ఏర్పడి వాహనాలు రాకపోకలు సాగించలేని విధంగాఉంది. దీనికి తోడు నాలుగు రోజుల నుంచి వర్షాలు కురవడంతో గుంతల్లో నీరు చేరి చిన్నపాటి చెరువులను తలపించే విధంగా మారాయి. ఓ వైపు బురద నీటితో నిండిన గుంతలు, మరో వైపు అంధకారంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మూడు నెలల నుంచి **ఈ మార్గానికి మోక్షం కల్పిస్తాం అని అధికారులు చెబుతున్నా.. పనులు మొదలు పెట్టకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు.**

- 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీ సేవా మార్గం నుంచి గాజువాక ఆర్టీసీ డిపోకు వెళ్లే బీటీ మార్గంలో ఇటీవల జీవీఎంసీ ప్రాజెక్ట్ అధికారులు భూగర్భ పైపులైన్ కోసం గోతులు తవ్వారు. పనులు పూర్తి చేసిన తర్వాత గోతులను సరిగ్గా కప్పకపోవడంతో వర్షాలకు గోతుల్లో మట్టి దిగి మరింత లోతుగా మారాయి.**దీంతో శనివారం శ్రీహరిపురం నుంచి** గాజువాక వైపు **ప్రయాణికులతో వెళ్తున్న ఆటో** నక్కవానిపాలెం **వద్ద గోతుల్లో కూరుకుపోయి**ంది. అలాగే ఆదివారం ఉదయం మల్కాపురం నుంచి గాజువాక వైపు వెళ్తున్న వాహనదారుడు గుల్లలపాలెం సేవా మార్గంలో తవ్విన గోతుల వద్ద అదుపు తప్పి గాయపడ్డాడు. మరిన్ని ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి సేవా మార్గాలకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



కోరమాండల్ ... సేవా మార్గం

కార్మిక నాయకుడు నర్సింగ్‌యాదవ్‌కు ఘన నివాళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న నక్క లక్ష్మణరావుయాదవ్

మల్కాపురం: స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విషయంలో దివంగత నర్సింగ్‌యాదవ్ చేసిన కృషి మరవలేనిది అని టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్ అన్నారు. 59వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఇంటక్ ఉపాధ్యక్షుడు ఎదురు నర్సింగ్‌యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం ఆధ్వర్యంలో సోమవారం హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద సంతాప సభ నిర్వహించారు. ఇంటక్ నాయకులతో పాటు,టీఎన్‌టీయూసీ,సీఐటీయూ,ఏఐటీయూసీ నాయకులు నర్సింగ్‌యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్మిక సంక్షేమానికి నర్సింగ్‌యాదవ్ చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో పలు ట్రేడ్ యూనియన్ల నాయకులు కె.పెంటారావు, కసిరెడ్డి సత్యనారయణ, నీరుకొండ రామచంద్రరావు, దేవర అప్పలరాజుయాదవ్ తదితులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే గణబాబుకు వినతి పత్రం అందిస్తున్న ముస్లిం నాయకులు

గోపాలపట్నం: విశాఖ నూర్ బాషా ముస్లిం సంక్షేమ సేవా సంఘం సభ్యులు గోపాలపట్నం పరిసర ప్రాంతంలోని ముస్లింల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గణబాబుకు సోమవారం వినతి పత్రం అందించారు. గోపాలపట్నం, ఎన్ఏడీ పరిసర ప్రాంతాల్లో ఖబరిస్తాన్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. పవిత్రదినాల సమయాల్లో నమాజ్ చేసుకునేందుకు ఈద్గా స్థలం ఇప్పించాలని కోరారు. మార్కెట్‌కు దగ్గరగా కబేళా ఏర్పాటు చేయాలని విన్నవించారు. అందుబాటులో ఉండవిధంగా షాదీ ఖానాలు ఏర్పాటు చేయాలని.. నియోజకవర్గానికి ఒక షాదీ ఖానా నిర్మించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని తెలిపారు.

నావికాదళ సివిల్ ఉద్యోగులకు నగదు రహిత క్యాన్సర్ వైద్యసేవలు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న హోమీబాబా, తూర్పు నావికాదళ అధికారులు

అగనంపూడి: తూర్పు నౌకాదళంలో విధులు నిర్వహించే సివిలియన్ ఉద్యోగులకు నగదు రహిత క్యాన్సర్ వైద్యసేవలు అందించేందుకు హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, తూర్పు నౌకాదళ కమాండర్ మధ్య పరస్పర ఒప్పందం కుదిరింది. ఈమేరకు తూర్పు నావికాదళ కమాంటెండ్ అధికారులు ఈ విషయాన్ని ఒక ప్రకటనలో తెలిపారు. రక్షణ దళంలోని సివిలియన్ ఉద్యోగులకు మెరుగైన క్యాన్సర్ చికిత్స అందించే లక్ష్యంతో ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు వారు పేర్కొన్నారు.

కరాటే పోటీల్లో ప్రకాష్ ప్రతిభ



బంగారు పతకాన్ని అందుకుంటున్న ప్రకాష్

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్‌నగర్ ప్రాంతానికి చెందిన ప్రకాష్ ఇటీవల కాకినాడలో జరిగిన 3వ ఇన్విటేషన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో మాస్టర్స్ కాటా ఈవెంట్ విభాగంలో బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా కె.మల్లికార్జున గౌడ్, నిర్వాహకుడు డి.శంకర్ ఆయనకు బంగారు పతకాన్ని, సర్టిఫికెట్‌ను అందజేశారు. విక్టర్ షాటోకాన్ నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 1800 మంది పాల్గొని, ప్రతిభ కనబరిచినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏయూ విద్యార్థులకు ప్లేస్‌మెంట్ కల్పిస్తాం



సంస్థ ప్రతినిధులను సన్మానిస్తున్న ఏయూ వీసీ, రిజిస్ట్రార్

విశాఖ విద్య: ఆంధ్రా విశ్వవిద్యాలయ విద్యార్థులకు అదానీ విల్మార్ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని సంస్థ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సిద్దార్థ ఘోష్ తెలిపారు. క్యాంపస్‌లో జరిగే సంస్థ నియామక కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏయూను ఆయనతోపాటు డీజీఎం–హెచ్‌ఆర్ ప్రభాకర్, ప్లాంట్ హెచ్‌ఆర్ హెడ్ యుగంధర్ తదితరులు సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావులను కార్యాలయంలో సిద్దార్థ ఘోష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదానీ విల్మార్, ఆంధ్ర విశ్వవిద్యాలయం మధ్య శాస్త్రీయ, పారిశ్రామిక బంధం బలోపేతం చేసుకుంటూ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అదానీ విల్మార్ సంస్థ ఏయూ ఎంహెచ్‌ఆర్ఎం, ఎంబీఏ–హెచ్‌ఆర్ విద్యార్థులకు రూ.8.5 లక్షల వార్షిక వేతన ప్యాకేజీని ప్రకటించింది. విద్యాలయ అధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులను సన్మానించారు. సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదేశ్వరరావు జయంతి



ఆదేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఆచార్యులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ ఆచార్యుడు పురుగుళ్ల ఆదేశ్వరరావు 90వ జయంతిని హిందీ విభాగంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. హిందీ భవన్ వద్ద గల ఆయన విగ్రహానికి విశ్వహిందూ పరిషత్ జాతీయ అధ్యక్షుడు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఏయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏయూ అభివృద్ధిలో ఆదేశ్వరరావు పాత్ర ఎంతో ఉందన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వందేళ్ల ఉత్సవాలకు సిద్ధమవుతున్న తరుణంలో నాటి మహనీయులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఏఎంసీ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎంబీబీఎస్ విద్యార్థులు బి.కిరణ్‌కుమార్(2021 బ్యాచ్), కాజల్ సింగ్ (2022 బ్యాచ్), డి.చరణ్‌నాయక్ (2024 బ్యాచ్) డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ విశ్వవిద్యాలయం అథ్లెటిక్స్(పురుషులు, మహిళలు) జట్టులో స్థానం సంపాదించారు. వీరు ఈ నెల 26 నుంచి 30 వరకు ఒడిశా రాష్ట్రం, భువనేశ్వర్‌లోని కళింగా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్ వద్ద జరగనున్న ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ (పురుషులు, మహిళలు) చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సోమవారం వీరిని కళాశాలలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రెసిడెంట్(క్రీడలు) డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, శారీరక విద్యా డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్.ఎన్.పాత్రుడు, డాక్టర్ ఆర్.ఎన్.భూషణరావు, డాక్టర్ పి.లక్ష్మణ్ రావు తదితరులు అభినందించారు. ఈ పోటీలకు ఎంపిక కావడం ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని ప్రిన్సిపాల్ అన్నారు.

టీ–20 రన్నరప్ విశాఖ జట్టుకు కలెక్టర్ అభినందన



విశాఖ జట్టు సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లా బధిరుల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విజేతలను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అభినందించారు. కలెక్టర్ సమావేశం మందిరంలో సోమవారం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అభివృద్ధి అధికారి జి.జాన్, దివ్యాంగుల శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి తదితరులు ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను తీసుకొచ్చి కలెక్టర్‌ను కలిశారు. ఈ నెల 18, 19 తేదీల్లో జరిగిన టీ–20 చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విశాఖ జిల్లా జట్టు రన్నర్ కప్ గెలుచుకుంది. రెండు రోజుల లీగ్ మ్యాచ్‌లో ఆటగాళ్లకు ఆహారం, వసతి కల్పించినందుకు దివ్యాంగులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన జట్టు సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎ.ఎ.బేగ్, ప్రెసిడెంట్ హసీమ్ బేగ్, జనరల్ సెక్రటరీ కె.నాగార్జున సాగర్, అనువాదకుడు అబ్దుల్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా 22వ రోజు సోమవారం కనక మహాలక్ష్మి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్త రోడ్డు సమీపంలోని జగన్నాథ స్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్లకు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో పైపులైన్లకు జీవీఎంసీ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. సుసర్ల కాలనీ దరి లక్ష్మీనగర్ ప్రాంత ప్రజలకు నీరు సరఫరా అయ్యే పైపులైన్‌కు ఉండే స్కూప్ వాల్వ్ లీక్ కావడంతో మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇది గమనించిన సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. జీవీఎంసీ ఈఈ కనకారావు ఆదేశానుసారం డీఈ వీరయ్య పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. పాడైపోయిన వాల్వ్ మార్చి కొత్తది బిగించారు. దీంతో నిరాటంకంగా నీటి సరఫరా జరగనుంది. కార్యక్రమంలో ఏఈ సింహాచలం నాయుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవింద్, సూపర్‌వైజర్ గొలగాని రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ హాకీ జట్టు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులతో ఆచార్య కృష్ణమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఇంటర్ యూనివర్సిటీ హాకీ పోటీల్లో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళల జట్టు ఎంపిక సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ జిమ్నాజియంలో క్రీడాకారిణులను ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎస్.వి జయమోహన్, విభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి అభినందించారు. విజయమోహన్ మాట్లాడుతూ తిరుచునాపల్లి భారతీయ దాసన్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుంచి 30 వరకు హాకీ మహిళల ఇంటర్ యూనివర్సిటీ పోటీలు జరుగుతాయన్నారు. పల్లవి మాట్లాడుతూ హాకీ పోటీల్లో ప్రతిభ చూపి ఏయూకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కోచ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీడీ దుర్గారావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు



విద్యుత్ దీపాలంకరణలో కొత్తపాలెం యునైటెడ్ చర్చ్



62వ వార్డులో ముస్తాబైన చర్చి



క్రాంతినగర్‌లో ముస్తాబైన ఇల్లు

సింధియా: క్రిస్మస్ సందడి మొదలైంది. దుకాణాల్లో క్రిస్మస్ నక్షత్రాలు, అలంకరణ వస్తువుల కొనుగోళ్లు జోరందుకున్నాయి. ఏసు ఆరాధకులు గృహాలపై నక్షత్రాలను ఏర్పాటు చేశారు. చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. క్రిస్మస్ ట్రీలు, పశువుల పాకలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. పశువుల పాకల్లో బాల ఏసు జనన ఘట్టాన్ని కళ్లకు కట్టేలా అలంకరించారు. 62వ వార్డు త్రినాథపురంలోని చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. నెల రోజుల నుంచి ఉపవాస దీక్షలతో సంఘ సభ్యులు నిత్యం ప్రార్థనలు చేస్తున్నారు. చిన్నారుల ఆట, పాటలతో సందడి చేస్తున్నారు. ఆరాధనలు, ఉపవాస దీక్షలతో క్రిస్మస్ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇక క్రిస్మస్ రోజైన బుధవారం ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో పలు చర్చిలు క్రిస్మస్‌కు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. గోపాలపట్నం లక్ష్మీనగర్ రివైవల్ చర్చ్, కొత్తపాలెం యునైటెడ్ క్రైస్ట్ చర్చ్ విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటికే పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ రోజు చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఉదయం సమయంలో పాస్టర్లు క్రీస్తు జన్మ వృత్తాంతంతో పాటు దైవ సందేశం ఇవ్వనున్నారు.

కాలుష్య నివారణకు ప్రత్యేక కార్యక్రమాలు



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాలినడకన కార్యాలయానికి వెళ్తున్న మేయర్ హరివెంకటకుమారి

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పిలుపునిచ్చారు. ఆరిలోవ పెదగదిలిలోని క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం ఉదయం ఆమె ప్రజా రవాణా వ్యవస్థ ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వారంలో ఒక రోజు వ్యక్తిగత వాహనాలు విడనాడి ప్రజా రవాణా ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు ప్రజా రవాణా ఉపయోగిస్తున్నారన్నారు.